ప్రాధాన్యత రంగాలకు రుణాల మంజూరు చేయాలి

బ్యాంకర్లతో కలెక్టర్ రిజ్వాన్‌బాషా సమావేశం

జనగామ చౌరస్తా, మార్చి 21 : ప్రాధాన్యత రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో బ్యాంకర్లతో (డీసీసీ/డీఎల్ఆర్సీ) కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రూరల్, సెమీ అర్బన్, అర్బన్‌లలో ఉన్న మొత్తం 63బ్యాంకులకు సంబంధించి వారు మంజూరు చేసిన రుణాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రాధాన్యత, అప్రాధాన్యత రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడానికి బ్యాంకర్లు కృషి చేయాలని తెలిపారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార విస్తరణ లేదా కొత్త ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు కోసం రుణాలు అందించడానికి రుణ మేళాలు ఏర్పాటు చేయాలన్నారు. వీధి వ్యాపారులకు ముద్ర రుణాలతో పాటు స్టాండప్ ఇండియా కింద రుణాలు అందించాలని ఆదేశించారు. అనంతరం నాబార్డు 2025-26 సంవత్సరానికి సంబంధించిన పొటెన్షియల్ లింకుడ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. అంతకు ముందు లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ వార్షిక రుణ ప్రణాళిక వివరాలను కలెక్టర్‌కు వివరించారు. వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం 2024-25 లక్ష్యం రూ.4569.48 కోట్లు కాగా, మూడవ త్రైమాసికానికి రూ.3040.59 కోట్లతో 66.54 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలు 70.89 శాతం, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు 71.35 శాతం, ప్రాధాన్యత రంగాలకు 59.31 శాతం రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రాధాన్యత రంగాల లక్ష్యం రూ.4045.72 కోట్లుకాగా, రూ.2399.62 కోట్ల నిధులు, అప్రాధాన్యత రంగాల లక్ష్యం రూ.523.76 కోట్లు కాగా, రూ.640.97 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ ఏజీఎం చంద్ర శేఖర్, డీఏవో రామారావు నాయక్, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- తొలిరోజు 99.90 శాతం హాజరు
- జిల్లావ్యాప్తంగా ఆరుగురు విద్యార్థుల గైర్హాజర్
- పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా

విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతిస్తున్న పోలీసులు

జనగామ చౌరస్తా, మార్చి 21 : పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం జనగామ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగాయి. తొలిరోజు జిల్లాలోని 41పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ భాష (తెలుగు) పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 6221 మంది హాజరుకావాల్సి ఉండగా, 6215 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో ఎం రమేశ్ తెలిపారు. మరో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 99.90 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే ప్రైవేట్ (ఒకసారి ఫెయి ల్ అయిన) విద్యార్థులు ఇద్దరికిగాను ఇద్దరు కూడా పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ నెల్లుట్ల, మోడల్ స్కూల్ లింగాలఘనపురం పరీక్ష కేంద్రాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా రాష్ట్ర పరిశీలకుడు ఎస్ శ్రీనివాసాచారి జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్ కొన్నె, బచ్చన్నపేట, న ర్మెట పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. రెండు ప్రత్యేక తనిఖీ బృందాలు జిల్లాలోని 12పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈవో రమేశ్ జనగామ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ నెల్లుట్ల, లింగాలఘనపురం పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.

అభివృద్ధిపై మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 21 : మార్చి బడ్జెట్‌లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వ్యవసాయ మార్కెట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యాశిరీష్ రెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మార్చి బడ్జెట్‌లో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో అంతర్గత సీసీ రోడ్లు, చిల్పూరు మండలంలో 50వేల మెట్రిక్ టన్నుల నూతన గోదాం ఏర్పాటు, జఫర్‌గఢ్ మండలంలో గల గోదాం చుట్టూ సీసీ రోడ్లు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలంలో జనరేటర్లు, జఫర్‌గఢ్‌లో ఆఫీస్ రూం, బోరు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటుపై కమిటీ సభ్యులతో కలిసి నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సెక్రటరి భాస్కర్, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ WANTED Telecallers in Education Sector. Salary 10,000/- Full time & part time 5,000/- Incentives are 10,000/- per Admission Cont:9908432153 & 7288826032.
NTW-6572

గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్
★ గోపాలపురం (HNK), 0% వడ్డీతో సులభ వాయిదాలతో సొంత ఇంటి కలను సాకారం చేసుకోండి. KUDA Approved గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్ (2BHK) సెల్: 6305185315.
NTW-332483

WANTED TEACHERS
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

CHANGE OF NAME
★I, PUSHPALATHA (Old Name) H.NO. 1 - 1 - 43 / B Door NO.202, 2nd Floor Anurag Enclave, Chaitanyapuri Colony, Hanumakonda Dist. have Changed my name from PUSHPALATHA (Old Name) to PARAKUTTH PUSHPALATHA(New Name) w/o SIVARAMAN VENKATAKRISHNAN for all purposes.
NTW-6573

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-AII

LOST OF DOCUMENTS
★I SANJAR UNNISA BEGUM w/o Mohammed Hussain, H No. 14-6-45 Nizampura, Warangal Dist-506002. Lost my Original Gift deed D.NO. 1296/1983 of SRO, Warangal (R.O) while travelling from Nizam pura Mandi bazar to Charbowli On. 15-03-2025 in Auto Rickshaw. If anybody found please inform me.Cell: 9848886278.
NTW-6574

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సాగు, తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

- వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ఉపాధి హామీ పనులు ఉదయమే చేపట్టాలి
- ఎల్ఆర్ఎస్ టార్గెట్ పూర్తి చేయాలి
- అధికారులతో కలెక్టర్ రిజ్వాన్‌భాషా సమీక్ష

లింగాలఘనపురం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘనపురం; మార్చి 21 : వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో సాగు, తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మిషన్‌భగీరథ గ్రిడ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటిస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, నీటిపారుదల అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి సాగునీటి తీరును పర్యవేక్షించి వరిపొలాలు ఎండకుండా చర్యలు తీసుకుని రైతుల్లో మనోధైర్యాన్ని నింపాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఉదయం వేళల్లో పనులు అప్పగించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీళ్ల క్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ గడువు ఈ నెలతో ముగుస్తున్నందున టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. 5వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉంటే ఇప్పటి వరకు కేవలం 230 పూర్తి చేయడంపై ఆయన పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వెలిబుచ్చారు.

అంగన్‌వాడీ టీచర్‌ను సస్పెండ్ చేయండి..

లింగాలఘనపురంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే తోవను అడ్డుకుంటున్నారని, ఆ టీచర్ లీవ్ పెట్టిందని సూపర్‌వైజర్ హంసమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అంగన్‌వాడీ టీచర్ రెండు రోజుల్లో విధుల్లో చేరకుంటే సస్పెండ్ చేయాలని, ఆమెను మెడికల్ టెస్ట్‌కు వెళ్లమని తేల్చి చెప్పాలన్నారు. దారిని అడ్డుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహసీల్దార్, ఎస్సైకి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో మండల స్పెషలాఫీసర్ హతీరామ్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రఘురామకృష్ణ, ఏవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్..

లింగాలఘనపురం మండలంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సందర్శించారు. నెల్లుట్ల హైస్కూల్‌లో 5పాఠశాలలకు చెందిన 118మంది విద్యార్థులు, మోడల్‌స్కూల్ కేంద్రంలో 7పాఠశాలలకు చెందిన 216మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్, ఏసీజీఈ రవికుమార్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఎంఈవో విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం..

- కలెక్టర్ ఆదేశాలతో అధికారుల పరుగు
- అంగన్‌వాడీ కేంద్రానికి దారి ఏర్పాటు...
- అడ్డుకున్న వారికి అధికారుల కౌన్సెలింగ్..

అంగన్‌వాడీ కేంద్రానికి దారి ఏర్పాటు చేస్తున్న అధికారులు

లింగాలఘనపురం : కలెక్టర్ షేక్ రిజ్వానా బాషా ఆదేశాలతో అధికార యంత్రాంగం శుక్రవారం పరుగులు దీశారు. మూడేళ్లుగా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం సమస్యను పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే.. లింగాలఘనపురం అంగన్‌వాడీ కేంద్రం-1 రాజకీయాలతో.. ఆక్రమణదారుల అడ్డగింతతో ఆ కేంద్రానికి వెళ్లే దారి ఆక్రమణకు గురైంది. తోవలేకపోవడంతో మూడేళ్లుగా కేంద్రం మూత పడగా, వేరే కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టీచరు కొడితాల రాణి అనారోగ్య కారణం చూపుతూ ఏడాదిగా సెలవులో ఉంది. ఈ నేపథ్యంలో పలు మార్లు ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేయడం, శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి, సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సీతారాంనాయక్‌లు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. జేసీబీతో అంగన్‌వాడీ కేంద్రానికి దారిని పునరుద్ధరించారు. అడ్డుకున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, కేసులు నమోదుచేసి జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్‌ను పిలిపించారు. రెండు రోజుల్లో విధుల్లో చేరాలని, లేదా రాజీనామా చేయాలన్నారు. లేదంటే సస్పెండ్ చేసి ఇంటికి పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎట్టకేలకు మూడేళ్ల సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. సీడీపీవో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో స్వరూపారాణి

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

స్టేషన్ ఘన్‌పూర్/పాలకుర్తి, మార్చి 21 : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని డీపీవో స్వరూపారాణి, డీఆర్డీవో ఎన్ వసంత అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో, పాలకుర్తి మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి హామీ పనులు ఉదయం 11గంటల వరకు పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిపన్ను వసూలు తదితర అంశాలపై రివ్యూ నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీడీవోలు విజయశ్రీ, రాములు, వ్యవసాయాధికారి చంద్రన్‌కుమార్, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎంపీవోలు నర్సింగరావు, రవీందర్, ఈజీఎస్ ఏపీవో ప్రేమయ్య, ఎస్సై వినయ్‌కుమార్, ఏఈ ప్రశాంతి, శరత్‌చంద్ర, డాక్టర్ సిద్ధార్థ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ నాప్కిన్స్ యంత్రం ఏర్పాటు

లింగాలఘనపురం, మార్చి 21, కస్తూర్బాలో శానిటరీ నాప్కిన్స్ ఎలక్ట్రికల్ యంత్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆదేశానుసారం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. ఈ యంత్రం విద్యార్థినులు ఉపయోగించి పడేసే నాప్కిన్స్‌ను దహనం చేస్తుందన్నారు. దీంతో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండి ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు.

నరేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చిల్పూరు, మార్చి 21 : మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నరేశ్ (35) ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. రోజు మాదిరిగానే కొయ్యడ నరేశ్ తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య నరేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, చిల్పూరు మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగు హరీశ్, మాజీ సర్పంచ్ కొయ్యడ రామ్‌దాసు, టేకులపల్లి కొమురయ్య, రజినీకాంత్, తండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

లింగాలఘనపురం, మార్చి 21 : మండలకేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ప్యాట ముత్తయ్య(41)అనారోగ్యంతో మృతి చెందాడు. ముత్తయ్య కుటుంబాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శుక్రవారం పరామర్శించారు. అంతిమ యాత్రలో పాల్గొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న, కేమిడి యాదగిరి, కేమిడి కవితావెంకటేశ్, ఎడ్ల రాజు, బెజ్జం చంద్రయ్య పాల్గొన్నారు.

ఇవేం చిల్లర రాజకీయాలు

- ఆంక్షలు లేకున్నా బీఆర్ఎస్ పార్టీ జెండాల తొలగించడమేంటి..?
- పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి

మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాలు తొలగిస్తున్న జీపీ సిబ్బంది

దేవరుప్పుల, మార్చి 21 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నేతృత్వంలో గురువారం రైతు నిరసన దీక్ష కార్యక్రమం జరిగిన విషయం విదితమే. కాగా పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను మండల కేంద్రంలో రహదారిపై డివైడర్‌కు కట్టారు. వీటిని శుక్రవారం గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చిం త రవి ఇటు పోలీసులకు అటు మండల పంచాయతీ అధికారిని, గ్రామ కార్యదర్శిని పార్టీ జెండాలను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం లేకపోవడం విశేషం. పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మండల కేంద్రానికి వస్తుండడంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి జెండాలను, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని చింత రవి ఆరోపిస్తున్నారు. కాగా, ప్రస్తుతం ఎలాంటి ఎన్నికల కోడ్ గానీ, ఇతర ఆంక్షలుగానీ లేకపోయినా ఏకపక్షంగా ప్రతిపక్ష పార్టీ జెండాలను అధికారులు కావాలని తొలగించడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని ఆయన అన్నారు. అధికారపార్టీ నాయకులు సైతం జెండాలను తొలగించాలనే చిల్లర రాజకీయాలు చేయ డం అనైతికమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చింత రవి ఆవేదన వ్యక్తం చేశారు.

'కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి'

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 21 : ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాపాలన అందిస్తామని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేడు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కోడెపాక యాకయ్య అన్నారు. శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్రంలోని నాలుగు ప్రధాన కార్మిక రంగాలైన హమాలీ వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్, ట్రాన్స్‌పోర్టు యూనియన్, బీడీ కార్మిక యూనియన్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా తనను ధర్నాకు వెళ్లకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని యాకయ్య తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా గురువారం రాత్రి నుంచే పోలీసుల ద్వారా నిర్బంధించడం సరికాదని అన్నారు. ఈ అరెస్టులను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించడం మంచిది కాదని అన్నారు. ప్రజాపాలన అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

జనగామ పేరు మారిస్తే మరో పోరాటానికి సిద్ధం

నల్ల కండువాలతో నిరసన చేస్తున్న జేఏసీ నాయకులు

జనగామ చౌరస్తా, మార్చి 21 : జనగామ జిల్లా పేరు మారిస్తే మరో ప్రజా పోరాటానికి సిద్ధం అవుతామని జేఏసీ జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉద్యమ స్ఫూర్తి స్తూపం (జైన స్తూపం) వద్ద జేఏసీ జిల్లా నాయకులు నల్ల కండువాలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా పేరు మార్చకుండా ప్రతిఘటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు, డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, మల్లిగారి రాజు, ఆకుల సతీశ్ మాట్లాడుతూ జిల్లా పేరును మార్చాలని కొందరు కోరుకుంటే, జనగామ జిల్లా పేరు మాత్రమే ఉండాలని అందరు కోరుకుంటున్నారు అని తెలిపారు. ఏ ఒక్కరి పేరిట జిల్లా పేరు మార్చినా మిగతా మహనీయులను అవమానించడమే కాదు ఆయా వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పేరును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో ప్రజా పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారులు గండి నాగరాజు, ఆకుల సతీశ్, పిట్టల సురేశ్, గంగా భవాని, మీసాల వెంకన్న, గన్ను కార్తీక్, నర్ర నవీన్, సుభాష్, తిరుమల్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, రాహుల్, కార్తీక్, అజయ్, ఇమ్రాన్, కిరణ్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో తనిఖీ

కొడకండ్ల, మార్చి 21 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈవో మాదురి కిరణ్ చంద్ర షా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఎంపీడీవో నాగశేషాద్రి సూరి, ప్రత్యేక అధికారి పాల్గొన్నారు.

జనగామకు సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలి

గౌడ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష


కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టిన గౌడ సంఘాల నాయకులు

జనగామ చౌరస్తా, మార్చి 21 : జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జిల్లాగా నామకరణం చేయాలని తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ వేదిక నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జనగామ కలెక్టరేట్ ఎదుట గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. అంతకు ముందు ఆర్టీసీ చౌరస్తాలో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత చేపట్టిన దీక్షలో గౌడ సంఘాల ఐక్యవేదిక నాయకులు అంబాల నారాయణగౌడ్, వంగ సదానందం గౌడ్, పంజాల జైహింద్‌గౌడ్, కన్న పరశురాములుగౌడ్, బూడిద గోపి మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును జనగామ జిల్లాకు నామకరణం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ దీక్షా కార్యక్రమానికి ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, సిద్దిపేట, యాదాద్రి, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి గౌడ సంఘాల నాయకులతోపాటు బహుజన కులాలకు చెందిన ప్రతినిధులు వందలాదిగా తరలివచ్చి తమ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో చీపురు మల్లేశ్‌యాదవ్, చల్లా సుధీర్‌రెడ్డి, అంకెనపల్లి వెంకటేశ్వర్లు, సానాడి రాజు, గిద్దె రాంనర్సయ్య, గొలుసుల దుర్గాచలం, గౌడ సంఘం నాయకులు బైరగోని యాదగిరి, నామాల శ్రీనివాస్, దూడల సిద్ధయ్య, మెరుగు బాలరాజు, మార్క ఉపేందర్, తీగల సిద్ధులు, అంబాల రఘునాథ్, ఆంజనేయులు, మనోజ్ కుమా ర్, సిద్ధయ్య, శ్రీనివాస్, శివరాం, వెంకటమల్లు, ఆంజనేయులు, సోమన్న, వీరస్వామి, బాలకృష్ణ, సోమరాజు, వెంకన్న, మల్లేశ్, భిక్షపతి, శివ కుమార్, నర్సయ్య, నారాయణ, పరశురాములు, సుధాకర్, వెంకన్న, రమేశ్, శ్రవణ్, యాదగిరి, రామ్మోహన్, హరిశంకర్, సాంబశివుడు, రేణుక, లత, సతీశ్ గౌడ్, రాజయ్య, మహేందర్, సమ్మయ్య, అయోధ్య, వెంకటేశ్, శంకరయ్య, లక్ష్మినారాయణ, పరంధాములు, ఉమాపతి, శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్, వసంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

ఆరునెలల్లో హెల్త్ కార్డులు మంజూరు

శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి

జనగామ, మార్చి 21 (నమస్తే తెలంగాణ)/జనగామ చౌరస్తా: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే తన ఏకైక ధ్యేయమని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలను చేపట్టడంతోపాటు ఆరునెలల్లో అందరికీ నగదు రహిత ఆరోగ్య కార్డులను ఇప్పిస్తామని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి జనగామ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు పీఆర్‌టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం కొల్ల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన నూకల ఎల్లారెడ్డి సమన్వయకర్తగా శుక్రవారం ఎన్ఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అభినందన, సన్మాన సభలో ఆయన మాట్లాడారు. సభలో పీఆర్‌టీయూ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీశ్‌రెడ్డి, హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, వరంగల్ జిల్లాశాఖ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, టీజీపేట బాధ్యులు గంగిశెట్టి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లోనే ఇఫ్తార్ విందు ఇవ్వాలి

బచ్చన్నపేట, మార్చి 21 : ప్రతి ఏడాది ఇచ్చిన విధంగానే ఈ యేడాది కూడా మండల కేంద్రాల్లోనే ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వాలని బచ్చన్నపేట మదీన మజీదు కమిటీ సభ్యులు తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు షంశీర్, షబ్బీర్, ఆజీం, గౌస్, దస్తగిరి, మున్నాలు మాట్లాడుతూ అధికారులు జనగామలో కాకుండా బచ్చన్నపేట మండల కేంద్రంలోనే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి గల్లీకి సీసీరోడ్డు వేస్తాం

జనగామ రూరల్, మార్చి 21 : గ్రామాల్లోని ప్రతి గల్లీకి సీసీరోడ్లు వేస్తామని మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పసరమడ్ల గ్రామంలో నూతన సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లింగాల నర్సిరెడ్డి, శివరాత్రి కుమార్, సుదగాని కృష్ణగౌడ్, ప్రకాశ్‌యాదవ్, కుర్రేముల రవికుమార్, బడికె కృష్ణస్వామి, దూడల తిరుపతి, మడిశెట్టి నర్సింగరావు, సాధన కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జనగామ, మార్చి 21 (నమస్తే తెలంగాణ)/జనగామ చౌరస్తా : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల పెండింగ్ బిల్లులను ఈ నెలాఖరులోపు చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామ జిల్లా కేం ద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐలో ఉ ద్యోగి పొదుపు చేసి దాచుకున్న వారి డబ్బును వారే తీసుకోవడానికి ఏళ్ల తరబడి ఎదురు చూడడం దౌర్భాగ్యం అని విమర్శించారు. హెల్త్ కార్డులు మంజూరు చేయడంలో విఫలమైన ప్రభుత్వం వైద్య ఖర్చుల (మెడికల్ రీయింబర్స్‌మెంట్) బిల్లులు చెల్లించకుండా ఉద్యోగులను వేధించడం సరైంది కాదన్నారు. గతేడాదిగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రిటైర్‌మెంట్ ఆర్థిక ప్రయోజనాలను చెల్లించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరు తనానికి నిదర్శనం అని ఎద్దేవా చేశారు. ఈ-కుబేరులో పెండింగ్ బి ల్లులన్నీ ఈ ఆర్థిక సంవత్సరం ముగియక ముందే చెల్లించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

28న యాదవ శంఖారావ సదస్సు

రఘునాథపల్లి, మార్చి 21 : జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరుగనున్న యాదవ శంఖారావ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం మండల ఇన్‌చార్జి చెవుల రాజు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కోమల్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘం సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఎంఆర్ గార్డెన్ సూర్యాపేట రోడ్డులో నిర్వహించనున్న యాదవ శంఖారావ సదస్సుకు మండలంలోని యాదవ్‌లు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేశ్‌యాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బచ్చన్నపేట, మార్చి 21 : మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం బచ్చన్నపేట పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెంకు చెందిన బదావత్ గణపతి రెండు క్వింటాళ్ల బియ్యాన్ని టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకుని వాహనం సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హమీద్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నర్మెట, మార్చి 21 : మండలంలోని హన్మంతాపూర్ గ్రామ పరిధి దొడ్డగడ్డతండా గ్రామానికి చెందిన కొర్ర ప్రదీప్(25) హైదరాబాద్‌లో కార్లు, మోటర్ సైకిళ్ల క్రయవిక్రయాలు జరుపుతూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. బిజినెస్‌లో నష్టం రావడంతో ఐదు రోజుల క్రితం దొడ్లగడ్డతండాకు వచ్చి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 19వ తేదీన వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగగా కుటుంబసభ్యులు హనుమకొండలో ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నాగేశ్ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ..

బచ్చన్నపేట, మార్చి 21 : ఆలీంపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన జ్యోతి అంజమ్మ కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు పరామర్శించారు. ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతావెంకటాచారీ, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు నరెడ్ల బాల్‌రెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, వెంకట్, మసూద్, అరుణాంజనేయులుగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ దాసారం శ్రీనివాస్, బాలచందర్, నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, గుర్రపు బాలరాజు, నరేందర్ తదితరులు పాల్గొని ఆమె కుటుంబ సభ్యులు బైరయ్య, భాస్కర్, భాగ్యలను ఓదార్చారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

జనగామ చౌరస్తా, మార్చి 21 : జనగామ జిల్లాలోని 12మండలాల్లో ఉన్న 8997 మహిళా స్వయం సహాయక సంఘాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రూ.16కోట్ల 22లక్షల17వేలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బులను మహిళా సంఘాల పొదుపు ఖాతాలకు సీఈవో-సెర్ప్, తెలంగాణ ఎస్బీ అకౌంట్ నంబర్ 62228879183 ద్వారా జమ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్లలో నూతన బ్రేకర్లు

లింగాలఘనపురం, మార్చి 21 : మండలంలోని కుందారం, వడిచర్ల, విద్యుత్‌సబ్‌స్టేషన్లలో విద్యుత్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, టెక్నికల్ డీఈ గణేశ్‌లు శుక్రవారం నూతన ఎల్‌వీ బ్రేకర్లు, బ్రేకర్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. దీంతో లోవోల్టేజీ సమస్య తీరిపోతుందన్నారు. ఏడీఈ అనిల్, ఏఈ శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.